6_6.qxd 6/4/2025 12:01 AM Page 1



పాతమాగులూరు ఏప ప్రాధమిక పాఠశాలలో

## నూతన ప్రధానోపాధ్యాయురాలికి ఘన స్వాగతం

**- ప్రభుత్వ సంస్కరణలో భాగంగా పూర్తి స్థాయిలో రానున్న ఉపాధ్యాయులు**



**సంతమాగులూరు ,జూన్ 3, ప్రభాతవార్త**

సంతమాగులూరు మండలం పాతమాగులూరు ఆది ఆంధ్ర ప్రాధమిక పాఠశాలలో బదిలీపై వచ్చిన నూతన ప్రధానోపాధ్యాయురాలు శ్యామల ను పాతమాగులూరు గ్రామసర్పంచ్ జిర్రా విజయబాబు విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ పెద్దలు ఘనంగా స్వాగతించారు. పాఠశాల వ్యవస్థలో సమూల మార్పులు తీసుకు వచ్చి అన్ని పాఠ్యాంశాలు బోధించేందుకు ప్రతి పాధమిక పాఠశాలకు కనీసంగా 5గురు ఉపాధ్యాయుల ఉండాలన్న రాష్ట్ర విధ్యాశాఖా మంత్రి నారా లోకేష్ చర్యలలో బాగంగా విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ సొంతనియోజకవర్గమైన అద్దంకి నియోజకవర్గంలో పాఠశాలల దశాదిశా మారనుంది. ఈనేపద్యంలో పాతమాగులూరు ఆది ఆంధ్ర ప్రాధమిక పాఠశాలలో 45 మందికన్నా ఎక్కువ విద్యార్థులు ఉండటంతో ఈ పాఠశాలకు పూర్తి స్తాయిలో ఉపాద్యాయులు రానున్నారు. ఉపాధ్యాయుల బదిలీలలో భాగంగా ఉపాధ్యాయులు ఈ పాఠశాలకు వస్తుండగా మొదటిగా వచ్చిన ప్రధానోపాధ్యాయురాలని స్థానికలు ఘనంగా స్వాగతించారు. పాఠశాలలో భాధ్యతలు తీసుకునేందుకు వచ్చిన శ్యామలపై పూల వర్షంకురింపిచారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వియబాబు మాట్లాడుతూ తమ పాఠశాలనుండి విద్యార్థులను ఉన్నత స్థాయికి వెళ్ళే విదంగా ప్రాధమిక స్తాయిలోనే మంచి విధ్యనందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయబాబుతో పాటు గ్రామ పెద్దలు విద్యార్థుల తల్లిదండ్రులు సహచర పుపాద్యాయులు పాల్గొన్నారు.

### వయో వృద్దులకు ,దివ్యాంగులకు ఇంటి వద్దనే రేషన్ సరకులు - తహశీల్దార్ రవిబాబు



**సంతమాగులూరు ,జూన్ 3, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు వయో వృద్దులకు, దివా ్యంగులకు ఇంటి వద్దనే రేషన్ సరకులు పంపిణీ చేస్తున్నట్లు సంతమాగులూరు తహశీల్దార్ రవిబాబు తెలిపారు. మండలంలో రేషన్ సరకులు పంపిణీ డీలర్ల వద్దనే జరుగే ప్రక్రియను మండలంలోని పలు గ్రామాలు తహశీల్దార్ రవిబాబు, డిప్యూటీ తహశీల్దార్రాఘవరావులుమంగళవారం పర్యటించి పర్యవేక్షించారు. ఈసందర్బంగా తహశీల్దార్ రవిబాబు మాట్లాడుతూ మండలంలోని 20 గ్రామ పంచాయితీలలో 43 రేషన్ షాపులు ఉన్నాయన్నారు. మండలంలోని వయో వృద్దులు ,దివ్యాంగుల వివరాలు డీలర్ల వారిగా తమ వద్ద సిద్దంగా ఉన్నాయని ఆవివరాలను 1వ తేదీకన్నా ముందే డీలర్లకు జాబితాలు అందజేయడం జరిగిందన్నారు.మండలంలోని 43 రేషన్ షాపులకుగా 2462 మందికి ఇంటి వద్దనే రేషన్ సరకులు అందించాల్సి ఉందన్నారు. ఇప్పటికే మూడు రోజులుగా 978మందికి డీలర్లు సరకులను ఇంటి వద్దకు తీసుకుపోయి లబ్దిదారులచేత వేలిముద్రలు వేయించుకుని సరకులు వారికి అందజేయడం జరిగిందన్నారు. డీలర్లు అందరూ 5వ తేదీలోగా డోర్ డెలివరీ ప్రక్రియను పూర్తి చేయాలని తాహసీల్దార్ రవిబాబు ఆదేశించారు. ప్రతినెలా 15వ తేదీ వరకు డీలర్లు కార్డుదాలకు అందుబాటులో ఉండి ప్రతికార్డు దారునికి సరకులు అందించాలని ఆదేశించారు.కార్డు దారులనుండి డీలర్లపై పిర్యాదులు వచ్చినట్లుయితే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

### వెన్నుపోటు ఉద్యమాన్ని విజయవంతం చేయాలి - ఊట్ల నాగేశ్వరరావు

**- వైసీపీ క్యాడర్ , ప్రభుత్వ బాధితులు అద్దంకి శాంతియుత ఉద్యమంలో పాల్గొనాలి**



**సంతమాగులూరు, జూన్ 3, ప్రభాతవార్త**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు పరచకుండా ప్రజలను వెనుపోటు పొడించిదని సంతమాగులూరు వైసీపీ కన్వీనర్ ఊట్ల నాగేశ్వరరావు అన్నారు. ప్రజల గళాన్ని మొద్దు నిద్రలో ఉన్న పాలకులకు తెలిసేవిధంగా తమ పార్టీ జూన్ 4న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏరాది పూర్తవుతున్న సందర్బంగా వెన్నుపోటు దినంగా ఉద్యమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహనరెడ్డి పిలుపు మేరకు బుధవారం రాష్ట్ర వ్యాపితంగా నిరసన గళం విప్పనున్నామన్నారు. అందులో భాగంగా అద్దంకి నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి పానెం చిన్న హనిమిరెడ్డి ఆద్వర్యలో చేయనున్న శాంతియుత ఉద్యమానికి సంతమాగులూరు మండలంలోని వైసీపీ కార్యకర్తలు , నాయకులు, ప్రభుత్వ బాధితులు పాల్గొని విజయవంతం చేయాలని ఊట్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

### పంటసాగు హక్కు పత్రాలు (సిఆర్సి)పై అవగాహన కార్యక్రమం

## - ప్రతి కౌతురైతుకు కౌలుకార్డు అందజేయాలి

**- తహశీల్దార్ చిరంజీవి**





**మార్కాపురం రూరల్, జూన్ 3, ప్రభాతవార్త**

మార్కాపురం మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం కౌలు రైతులకు పంటసాగు హక్కుపత్రాల పంపిణీపై అవగామన సదస్సు గ్రామ రెవెన్యూ అధికారులకు, గ్రామ వ్యవసాయ సహాయకులకు మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్బంగా తహశీల్దార్ చిరంజీవి మాట్లాడుతూ పంట సాగు హక్కుపత్రం (సిసిఆర్సి) పొందిన రైతుకు సాధారణ రైతులకువర్తించే అన్నిపథకాలు వర్తిస్తాయని వివరించారు. కౌలురైతులు పంటసాగు కొరకు సిసిఆర్సి కార్డుపై ప్రభుత్వం బ్యాంకులలో రుణాలు కూడా అందజేస్తారని తెలియజేశారు. గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రతి కౌలు రైతుకు కౌలు కార్డు అందజేసి కౌలు రైతుకు ప్రభుత్వ పథకాలన్నీ అందింపజేయాలని తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలోని కౌలు రైతులు అందరూ పంట సాగు హక్కుపత్రం -2019 చట్టం ప్రకారం రైతులు కచ్చితంగా పంట సాగు హక్కు పత్రం తీసుకోవాలని, తద్వారా కౌలు రైతులకు పంటలు నష్టపోయిన యెడల నష్టపరిహారం, పంటల భీమా, పంటకోయగా వచ్చిన పంట దిగుబడికి మద్దతు ధరకు కౌలు అమ్ముకోవచ్చని, సబ్సిడీపై విత్తనాలు కూడా పొందవచ్చని తెలియజేశారు. కౌలు కార్డుతో భూ యజమానులు హక్కులకు ఎటువంటి నష్టం వాటిల్లదని భూ యజమానులకు తెలియజేసి గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి రైతుల అందరికీ తెలియజేయాలన్నారు. కౌలు కార్డు కేవలం 11నెలలు కాలపరిమితితో సిసిఆర్సి కార్డు అందజేస్తారని రైతులకు తెలియజేయాలని కోరారు. అలాగే ప్రభుత్వం రైతుల సాగుకోసం అందించే అన్నదాత సుఖీభవ పథకం కూడా టార్గెట్ ఇచ్చి ఉన్నారు. కావున కౌలు చేస్తున్న ప్రతి రైఉతును గుర్తించి వారికి పంట సాగు హక్కుపత్రం అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు,విఆర్వోలు, గ్రామఆర్ఎస్కె సిబ్బంది పాల్గొన్నారు.

### కౌలురైతు పంట పరిహారం పొందాలంటే కౌలు పత్రం తప్పనిసరి

**- తహశీల్దార్ వెంకటేశ్వర్లు**



**రాచర్ల, జూన్ 3 ,ప్రభాతవార్త**

కౌలు రైతులు పంటలకు సంబంధించి ఎలాంటి పరిహారాలు పొందాలన్నా భూ యజమాని నుండి కౌలుపత్రం తప్పని సరిగా పొందాలని మండల తహశిల్దార్ ఎల్ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మండల తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన గ్రామ వ్యవసాయ శాఖ సిబ్బందికి మరియు విఆర్వోలకు ప్రత్యేక సమావేశం నిర్వహించి కౌలు కార్డులు, వాటి వలన కౌలు రైతులు పొందే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. భూమి కౌలుకు తీసుకున్న ప్రతి రైతు భూ యజమాని నుండి కౌలుపత్రం పొందాలని, కౌలుపత్రం పొందితేనే ఎరువులు, విత్తనాలు, పంటల రాయితీ, ఇన్సూరెన్స్, నష్టపరిహారం లాంటివి పొందవచ్చని, ఆ కార్డు ఉంటేనే "ఈ"పంట కూడా వారిపేరుపై నమోదు చేసుకోవచ్చని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారి షేక్ అబ్దుల్ రఫిక్ మాట్లాడుతూ భూమి కౌలుకు తీసుకున్న కౌలు రైతులు సిసిఆర్సి పత్రం భూ యజమాని నుండి పొందితే కౌలు రైతులకు పంటల రాయితీలు వస్తాయని లేకపోతే రావన్నారు. భూ యజమాని, కౌలు రైతుకు కౌలుపత్రం రాసిచ్చినంత మాత్రాన ఎలాంటి నష్టం జరగదని ఆ పత్రం కాలపరిమితి రాసి ఇచ్చిన 11నెలలు మాత్రమే ఉంటుందని ఆ తరువాత భూమి రైతుదే అన్నారు. కౌలు కార్డు వలన పంటలకు సంబంధించిన పరిహారం మ ఆత్రమే కౌలు రైతులకు లభిస్తుంది తప్ప మిగతా ఎలాంటి ప్రయోజనం కౌలు రైతుకు ఉండదని భూ యజమానికి కూడా ఎలాంటి నష్టం వాటిల్లదని అన్నారు. కేవలం పంటల సాగుపై ప్రభుత్వం నుండి పరిహారాలు పొందేందుకు కౌలు కార్డు ఉపయోగపడుతుందన్నారు. కాబట్టి భూ యజమానులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కౌలు రైతులు కూడా తప్పనిసరిగా పరిహారం పొందాలంటే భూ యజమాని నుండి కౌలు పత్రం పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ హర్షగౌడ్, విఆర్వోలు ఏ మాచర్ల, ఎస్ రంగయ్య, కె లక్ష్మీ, పి రంగయ్య నాయుడు, ఏ శివారెడ్డి, ఆర్ శివపార్వతి, డి యోనా, ఈ వెంకటేశ్వర్లు, రత్నస్వామి, ఎస్ శివయ్య, బి కిషోర్ కుమార్, బి రజిత, పి డేనియేల్, గ్రామ వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

### మార్కాపురం డివిజన్ కేంద్రంలో బిసి బాలికలకు వసతిగృహం ఏర్పాటు చేయాలి

**- బిసి సంక్షేమ సంఘం జాతీయ నాయకులు పిఎల్పి యాదవ్**



**మార్కాపురం రూరల్, జూన్ 3, ప్రభాతవార్త**

మార్కాపురం డివిజన్ కేంద్రంలో బిసి బాలికల వసతి గహాన్ని ఏర్పాటు చేయవలసిందిగా బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పిఎల్పి యాదవ్ మార్కాపురం సబ్ కలెక్టర్ త్రివినాగ్ను కలిసి కోరడమైనది. సుమారు 150 మందికి పైగా విద్యార్ధినీలు ప్రతి విద్యా సంవత్సరంలోను హాస్టల్ లేని కారణంగా ఉన్నత పాఠశాల విద్యను అభ్యసించకుండానే తమ తమ గ్రామాలకు పరిమితమవుతున్నారు. బాలిక విద్య యొక్క ఆవశ్యకతను గుర్తించి మార్కాపురంలో వసి గృహాన్ని ఏర్పాటు చేయమని అనేక సంవత్సరాలుగా బిసి సంక్షేమ సంఘం తరపున విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నామని రానున్న విద్యా సంవత్సరంలో ప్రైవేటు భవనంలో అయినా వసతి గహాన్ని ప్రారంభించి పేద బిసి బాలికలను విద్యావంతులను చేసేందుకు కృషి చేయవలసిందిగా సబ్ కలెక్టర్ను కోరడమైనది. వసతి గృహాన్ని శాశ్వత ప్రాతిపదికన స్థల సేకరణ చేసి నూతన భవనాన్ని నిర్మించే ఏర్పాట్లను చూస్తామని కూడా సబ్ కలెక్టర్ హామీ ఇవ్వడం జరిగింది. ఈ సంవత్సరం ఎట్టి పరిస్థితులలో కూడా పుల్లల చెరువు, త్రిపురాంతకం ప్రాంతాల నుంచి కమాడా వస్తున్నటువంటి బాలికలకు హాస్టల్ వసతి ఏర్పాటు చేయడం ద్వారా డ్రాప్ అవుట్ లేకుండా అందరినీ విద్యావంతులుగా చేసి వారి భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు సబ్ కలెక్టర్ తగు ప్రయత్నాలు చేస్తామని హామీ ఇవ్వడం అయినదని తెలిపారు. ప్రతి విద్యా సంవత్సరం మొదట్లో బిసి సంఘం వారి అభ్యర్ధన మేరకు అప్పటి సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు వేరే వసతి గృహాల్లో బాలికలకు కొంతమేరకు అవకాశం కల్పిస్తున్నారని ఇది సరిపోని పరిస్థితుల్లో ఈ విద్యా సంవత్సరం తప్పనిసరిగా ప్రైవేటు భవనంలో వసతి గృహాన్ని ఏర్పాటు చేయవలసిందిగా బిసి సంఘం ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పిఎల్పి యాదవ్, జాతీయ కార్యవర్గ సభ్యులు రంగస్వామి గౌడ్, అబ్రహం, రాజ్ కుమార్, శంకర్ గౌడ్, వెంకటేష్, నారాయణ, రాంబాబు, ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ త్రివినాగ్



**మార్కాపురం రూరల్, జూన్ 3, ప్రభాతవార్త**

మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ మంగళవారం స్థానిక తహశిల్దార్ కార్యాలయంను ఆకస్మికంగా తనికీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కార్యాలయంలోని అన్ని విభాగాల ఉద్యోగుల వివరాలు, వారి విధులను అడిగి తెలుసుకున్నారు. అలాగే కార్యాలయం నందు ప్రజల నుంచి స్వీకరించిన ప్రజా సమస్యల ఫిర్యాదు వివరాలను ఆరాతీశారు. అందులో ఎన్ని ఫిర్యాదులు పరిష్కరించాము, పరిష్కరించని రెవెన్యూ సమస్యలు ఎన్ని ఉన్నాయంటూ వివరాలు కావాలని సత్వరమే పెండింగ్ లేకుండా ప్రజల సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ తదితర రికార్డులను పరిశీలించారు.

### ఏపిటిడిసి చైర్మన్ను కలిసిన గిద్దలూరు టీడిపి నాయకులు



**గిద్దలూరు, జూన్ 3,ప్రభాతవార్త**

రాష్ట్ర ఏపిటిడిసి కార్యాలయంలో ఏపి టూరిజం డెవలప్మెంట్ ఛైర్మన్ మరియు ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు నూకసాని బాలాజీని గిద్దలూరు నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర ఐటిడిపి కార్యదర్శి దూదేకుల దస్తగిరి, గిద్దలూరు నియోజకవర్గ తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షులు బొర్రా రాఘవేంద్ర యాదవ్,మరియు నియోజకవర్గ ఐటిడిపి ప్రధాన కార్యదర్శి దూదేకుల సయ్యద్ మియాలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**జరుగుమల్లి, జూన్ 3, ప్రభాతవార్త**

జరుగుమల్లి మండలంలో జరుగుమల్లి 33/11కేవీ సబ్స్టేషన్ పరిధిలో ఉన్న జరుగుమల్లి, వావిలేటిపాడు ఆక్వా రైతులకు చెట్లు తొలగించడం కారణంగా నేడు ఈ గ్రామాలకు ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు కరెంటు నిలిపివేయబడును. దయచేసి వినియోగదారులు గమనించగలరని ఏఈ జి.హరిదీప్ తెలిపారు.

## మలేరియా నివారణ మాసోత్సవాల ర్యాలీ



**కొనకనమిట్ల, జూన్ 3, ప్రభాతవార్త**

మలేరియాను నివారించాలని కోరుతూ కొనకనమిట్ల ప్రాధమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్యాధికారి ఎస్పీ బాలయ్య ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా ఈ ర్యాలీ నిర్వహించడం జరిగిందని, తొట్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. రాత్రి వేళలో దోమతెరలు వాడాలని వివిధ సూచనలు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ప్రతాప్రెడ్డి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## వెన్నుపోటు దినం ర్యాలీని జయప్రదం చేయండి

**కొనకనమిట్ల, జూన్ 3, ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ వైకాపా ఆధ్వర్యంలో మార్కాపురంలో వెన్నుపోటు దినం ర్యాలీ జరుగుతుందని మండల కన్వీనర్ మోరా శంకర్రెడ్డి తెలిపారు. మార్కాపురం నియోజకవర్గ ఇన్ఛార్జీ అన్నా రాంబాబు నాయకత్వంలో బుధవారం ఉదయం 9.30గంటలకు వెన్నుపోటు దినం ర్యాలీ పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గడియారస్తంభం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించబడుతుంది. ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సంవత్సరం గడిచినా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసి వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ ర్యాలీ చేపట్టడం జరుగుతుందన్నారు. ర్యాలీ ముగింపు సమయంలో సబ్ కలెక్టర్కి వినతిపత్రం అందజేయడం జరుగుతుందన్నారు. ప్రజాస్వామన్ని కాపాడే ఈ ఉద్యమంలో ప్రతి నాయకుడు, కార్యకర్త, పార్టీ అభిమాన్ని ప్రజా ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ



**నాగులుప్పలపాడు, జూన్ 3, ప్రభాతవార్త**

నాగులుప్పలపాడు మండలంలోని 64 ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరానికి గాను సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లును పాఠశాలకు పంపిణీ చేయడం ప్రారంభించడం జరిగింది. మొత్తం 3764 మంది విద్యార్థులకు టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, యూనిఫామ్, బెల్ట్, డిక్షనరీలు మండల స్టాక్ పాయింట్కి చేరడం జరిగింది. వీటిని పాఠశాలల వారీగా ప్యాక్ చేసి పంపిణీ చేయడం జరుగుతుందని, పాఠశాలల ప్రారంభం రోజునే ప్రతి విద్యార్థికి కిట్లు అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మండల విద్యాశాఖాధికారులు టి.రవి, ఈవీ రమణయ్యలు తెలియజేశారు.

### వేసవిలో దాహార్తి తీర్చాలని శ్రమించిన

### ముస్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ ప్రశంసల వెల్లువ

**కనిగిరి, జూన్ 3, ప్రభాతవార్త**

కనిగిరిలో వేసవి తాపాన్ని తట్టుకోలేని స్థితిలో నీటి కోసం ఇబ్బందులు పడుతున్న ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ ముమ్మరంగా కృషి చేశారు. ఇటీవల కనిగిరి పట్టణంలోని 1వ వార్డు పాత సాయిబాబా గుడి ప్రాంతంలో ప్రజలు నీటి కొరతపై ఫిర్యాదు చేయగా, వెంటనే స్పందించిన చైర్మన్ స్థానికులను పరామర్శించి సమస్యను పరిశీలించారు. బోరు రెండు నెలలుగా పని చేయడం లేదని తెలుసుకొని మున్సిపల్ అధికారులను ఆదేశించి బోరు మరమ్మత్తులు వేగవంతంగా పూర్తి చేశారు. మంగళవారం నాటికి కొత్తగా బోర్ వేయించి, తాగునీటి సరఫరా ప్రారంభించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. చైర్మన్ గఫార్కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజల సంక్షేమమే మా లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఎమినిటీస్ సెక్రటరీ లావణ్య, లైన్మాన్ వలి, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## అంకాలమ్మ దేవస్థానంలో పూజలు చేసిన కదిరి బ్రదర్స్



**కనిగిరి, జూన్ 3, ప్రభాతవార్త**

కనిగిరి మండలంలోని వంగపాడు గ్రామంలో అంకాలమ్మ తిరునాళ్ల మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బండ్లు పొంగళ్ల కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సూందర్భంగా కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు సోదరులు కదిరి ప్రకాశ్రావు, కదిరి పార్థసారథిలు అమ్మవారిని దర్శించుకుని వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కదిరి పిచ్చయ్య, కదిరి రమణయ్య, కదిరి కృష్ణ, మాజీ ఎంపీటీసీ మునగల నారాయణరెడ్డి, ఇరగని చలపతిరావు, సుంకరి అంజనాద్రి, పట్నం తిరుపతయ్య, అడపా మధు, అన్నంగి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

### బర్లీ పొగాకు రైతాంగానికి ఎమ్మెల్యే ఏలూరి పలు సూచనలు



**మార్టూరు, జూన్ 3, ప్రభాతవార్త**

నల్లబర్లీ పొగాకు రైతులకు ప్రభుత్వం భరోసా ఇచ్చింది, రైతులు ధైర్యంగా ఉండాలని, కొనుగోలుకొంత సమయం ఇవ్వాలని,పొగాకు కొనుగోలు అందుబాటులో ఉన్న అన్ని అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తుందని, ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక శ్రద్దతో పర్యవేక్షిస్తున్నారని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రైతులకు తెలియజేశారు. వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బాధ్యతలు తీసుకున్న బుడిత రాజశేఖర్ను ఎమ్మెల్యే ఏలూరి కలిసి మాట్లాడారు. దేశ చరిత్రలో ఇంతకు ముందు ఏ ప్రభుత్వాలు నల్లపొగాకు కొనుగోలు చేసిన దాఖలాలు లేవన్నారు. ఈనెల 10వ తేదీకి రెండు రోజులు అటు ఇటు మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు ప్రారంభిస్తారన్నారు. ఇప్పటికే ప్రభుత్వం దగ్గర నల్లబర్లీ రైతుల వివరాలు ఉన్నాయి. వీటి ఆధారంగా ఏ రోజు ఏ రైతు సరుకు సంబంధిత ఏఎంసీ సెంటర్కు తీసుకురావాలనేది ముందుగా పర్మిట్ ఇష్యూ చేస్తారన్నారు. పర్మిట్ పొందిన రైతులు మాత్రమే ఆరోజు సరుకు మార్కెట్ యార్డులకు తీసుకురావాలని అన్నారు. ప్రతి రైతు దగ్గర ఉన్న చివరి ఆకు వరకు కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. దీనికి సంబంధించి మార్గదర్శకాలు త్వరలో ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు ఏఎంసీలలో గోడౌన్ సౌకర్యం, సామర్థ్యాన్ని పరిశీలించడానికి బాపట్ల మార్క్ఫెడ్ డీఎంను ప్రభుత్వం పంపిందన్నారు. వచ్చే సంవత్సరం ఏ పంట వెయ్యాలనేది రైతులందరూ సమిష్టిగా నిర్ణయం తీసుకుంటారన్నారు. బర్లీ పొగాకు ఉత్పత్తిదారుల సంఘాన్ని ఏర్పాటు చేసి, ప్రైవేటు పొగాకు కంపెనీలతో సరైన ఒప్పందం ఉంటేనే భవిష్యత్తులో బర్లీ పొగాకు సాగుకు రైతులు మొగ్గు చూపాలన్నారు. బర్లీ పొంగాకు ఎక్స్పోర్ట్ అవకాశాలు, ప్రాసెసింగ్ యూనిట్ సామర్థ్యం, కొనుగోలు రంగంలో నిష్ణాతులైన నిపుణుల వివరాలు, దీర్ఘ కాలంలో ఈ పంట పండించే రైతుల ప్రయోజనాలు కాపాడడానికి ప్రభుత్వ ఉన్నతాధికారులచే నిరంతరం స్టడీ చేస్తుందన్నారు. వ్యవసాయశాఖ కమీషనర్, మార్కెటింగ్ శాఖ కమీషనర్, బాపట్ల జిల్లా కలెక్టర్తో, టొబాకో బోర్డుతో, ప్రిన్సిపల్ సెక్రటరీ అగ్రికల్చర్ నిరంతరం అందుబాటులో ఉండి ప్రణాళికలు తయారు చేస్తున్నారు. వారందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మీద నమ్మకంతో రైతులు ధైర్యంగా ఉండాలని కోరారు. అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని, రైతన్నలకు కూటమి ప్రభుత్వం నిరంతరం అండగా ఉంటుందన్నారు.

### అగ్ని ప్రమాద బాధితులకు చైతన్య జ్యోతి ఫ్రెండ్స్ సర్కిల్ చేయూత



**యర్రగొండపాలెం,జూన్ 3,ప్రభాతవార్త**

యర్రగొండపాలెం పట్టణంలోని గాయత్రి సినిమా హాల్ వద్ద ఉన్న పోలేపల్లి వెంకటేష్ పూరిగుడిసె అగ్ని ప్రమాదానికి గురైంది. దీంతో ఇంట్లో ఉన్న సామాగ్రి మొత్తం కాలిపోయింది. భార్య ఇద్దరు పిల్లలతో ఆ గుడిసెల నివసిస్తున్న వెంకటేష్ చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటువంటి తరుణంలో ఇల్లు అగ్ని ప్రమాదానికి గురవటంతో కట్టుబట్టలతో రోడ్డున పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న చైతన్య జ్యోతి ఫ్రెండ్స్ సర్కిల్ మానవత్వం చాటుకుంది. ఆ ఎన్జీవో సంస్థ సభ్యులు తమ వంతుగా 8వేల 500 అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఆంజనేయులు మాట్లాడుతూ...మానవసేవయే మాధవసేవగా భావించి చైతన్య జ్యోతి ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు ఈ కార్యక్రమానికి తమ వంతు సాయాన్ని అందిండం ముదావహం అని ఎంఈఓ అన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలకు చైతన్య జ్యోతి ఫ్రెండ్స్ సర్కిల్ ముందుంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వి.కోటేశ్వరరావు, పబ్బిశెట్టి రవి, మల్లిపెద్ది రవీంద్రబాబు, అడిపి నాగయ్య, బాబుల్ నాయక్, డి. శ్రీను, షేక్ ఇమ్రాన్, జ్యోతి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రైవేటు పాఠశాలలో ఉచిత ప్రవేశాలు...ఎంఈఓ ఆంజనేయులు



**యర్రగొండపాలెం,జూన్ 3,ప్రభాతవార్త**

విద్యాహక్కు చట్టం అమలులో భాగంగా ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేదలకు ఉచితంగా కేటాయించారు. ఈమేరకు విద్యాహక్కు చట్టం 12 (1సి) అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఎంఈఓ తెలిపారు. అందుకు సంబంధించి గత నెలలో సమారు 23 మంది ఆన్లైన్లో నమోదు చేసుకున్నారని ఎంఈఓ తెలిపారు. మంగళవారం వివిధ ప్రైవేటు పాఠశాలల హెడ్మాస్టర్లు, తల్లిదండ్రుల సమక్షంలో ఉచిత ప్రవేశాలు కల్పించామని ఎంఈఓ తెలిపారు.ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ...విద్యాహక్కు చట్టం సక్రమంగా అమలు పరచకపోయినా, తల్లిదండ్రులనుంచి ఎక్కువ ఫీజులు వసూలు చేసినట్లు తమ దృష్టికి వచ్చినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పద్మజ, రామకృష్ణారెడ్డి, జ్యోతిప్రసాద్, బాపూజీ, సీఆర్పీ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మురుగిమ్మిలో తెల్లరాయి దోపిడి..

**- అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఖజానాకు నష్టం**






**కనిగిరి, జూన్ 3, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గంలోని పెద్దచెర్లోపల్లి మండలానికి చెందిన మురుగిమ్మి గ్రామంలో అక్రమ తెల్లరాయి తవ్వకాలు యధేచ్ఛగా సాగుతున్నాయి.ఈ తవ్వకాలకు తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులే మద్దతు ఇచ్చి, ఆదిపత్యం చలాయిస్తున్నట్లు సమాచారం. అటవీ, రెవెన్యూ భూముల్లోని విలువైన తెల్లరాయిని భారీ ఎత్తున తవ్వించి, అనుమతులు లేకుండా ట్రాక్టర్లు లారీల ద్వారా తరలిస్తున్నారు.

**ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం :**

ఈ తరహా తవ్వకాలపై ప్రభుత్వం ఎలాంటి రాయల్టీ లేదా మైనింగ్ శిస్తు వసూళ్లు చేయకపోవడం వల్ల ఖజానాకు లక్షల నుంచి కోట్ల రూపాయల వరకు నష్టం జరుగుతోంది. సాధారణంగా ఈ రాయిపై ప్రభుత్వం శిస్తు విధించాలి. కానీ ప్రస్తుత చర్యల లేమితో ఆ ఆదాయం పూర్తిగా నిలిచిపోయినట్లు తెలుస్తోంది.

**అధికారుల మౌనమే ఆమోదంగా :**

స్థానిక ప్రజలు, సంఘాల నాయకులు చెబుతుంటే.. పచాయతీ, రెవెన్యూ, మైనింగ్ శాఖలు ఈ వ్యవహారంపై నిశ్చలంగా ఉన్నాయి.వారి మౌనం వల్లే ఈ అక్రమాలు మరింత ప్రోత్సాహం పొందుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. కొంత మంది అధికారులు ఈ కార్యకలాపాలపై తెలివిగా కన్ను మూస్తున్నారనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

**ప్రజల్లో ఆందోళన, నిరాశ :**

ప్రభుత్వ సంపదను కొందరు వ్యక్తిగత లాభాల కోసం దోచుకుంటున్నారు. ఇది శ్రమించే పేద ప్రజల హక్కుల దోపిడి. అధికారులు కనీసం స్పందించకపోతే ప్రజాసంఘాలతో కలిసి మనమే ఉద్యమానికి దిగాల్సి ఉంటుందని గ్రామస్తులతో ఒకరు మీడియాతో చెప్పారు.

**నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకోవాలి :**

స్థానిక నాయకులు, వన సంరక్షణ సంఘాలు, ప్రజా సంఘాల ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా కలెక్టర్కు ఫిర్యాదులు చేయడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని అక్రమ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని, లేదంటే పెద్ద స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

# మలేరియాపై అవగాహన ర్యాలీ




**ముండ్లమూరు, జూన్ 3, ప్రభాతవార్త**

జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మలేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ ముండ్లమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.జాస్మిన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ మలేరియా జ్వరాలు ఎనాఫిలస్ ఆడ దోమ కాటు ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తాయని, ప్రజలు అవగాహన పెంచుకుని ముందస్తు జాగ్రత్తలు, సూచనలు పాటించి దోమకాటు నుంచిరక్షణ పొందగలిగితే జ్వరాలు రాకుండా కాపాడుకోవచ్చని దర్శి మలేరియా సబ్ యూనిట్ అధికారి నర్రావుల బసవారి మాట్లాడుతూ ఇంటిలో చుట్టు పక్కల ఎక్కువ రోజులు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం నీటి తొట్లు, డ్రమ్ములు, శుభ్రం చేసి నీరు నింపుకోవాలని, దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలని అన్నారు. రాత్రులు దోమతెరలు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ ఆరోగ్యఅధికారి నారాయణరావు, హెచ్ఈ శారద, హెచ్ఎస్ సుబ్బారావు, ఏఎన్ఎంలు, ఆశాలు, సిబ్బంది పాల్గొన్నారు.

# వెన్నుపోటు గొడ్డలిపోటు వైసీపీ పార్టీ ఇంకా మర్చిపోలేదు

**- దర్శి టీడీపీ నేతలు ఎద్దేవ**



**దర్శి, జూన్ 3, ప్రభాతవార్త**

మన మంచి కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలో ప్రజలు ఎంతో ఆనందంగా సుఖశాంతులతో జీవిస్తున్నారు. ఓర్వలేని వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఉనికి ని చాటుకునేందుకు వెన్ను పోటు దినంగా నిరసనలకు పిలుపునిస్తే ప్రజలు సహించలేరని హెచ్చరించారు. దర్శిలో టీడీపీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధికి సహకరించకుండా అభివృద్ధిని అడుగడున అడ్డుకుంటూ ఇలాంటి వెన్నుపోటు అంటూ వారికున్న తలపోటును ఇలా తీర్చుకుంటున్నారన్నారు. పార్టీలో నాయకులందరూ వెళ్లిపోయి కేవలం 11 సీట్లకే పరిమితమై ఉన్న ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు జగన్‌పడుతున్న నాటకమే ఇది. మీరు నిరసనలు చేస్తే ప్రజలు సహించరని హెచ్చరించారు. ఇలాంటి కార్యక్రమాలతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారు. అభివృద్ధికి సహకరించండి మన దర్శి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మహిళా అయినప్పటికి నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజల సమస్యల కోసం పరితపిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి ముందుండి పని చేస్తున్నారు. అది చూసి ఓర్వలేక అభివృద్ధికి సలహాలు ఇవ్వకుండా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి మార్కెట్ యార్డు చైర్మన్ దారం సుబ్బారావు, దర్శి మండల పార్టీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, టౌన్ పార్టీ అధ్యక్షులు చిన్న, గొర్రె సుబ్బారెడ్డి, శ్రీనాథ్, రూపినేని వెంకటరావు, ఊరిబిండి మధు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన BSF జవాన్



**సింగరాయకొండ, జూన్ 2,ప్రభాతవార్త**

మండలంలోని పాకల గ్రామానికి చెందిన బీఎస్ఎఫ్ జవాన్ పాండూరి ప్రదీప్ కుమార్ ఇటీవల ఒంగోలులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. గత పది రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోమాలో ఉన్న ఆయన మంగళవారం కన్నుమూశారు.దేశ రక్షణలో విధులు నిర్వహిస్తూ దేశానికి సేవలందించిన ప్రదీప్ కుమార్ అకాల మరణం పట్ల గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి వార్త తెలిసిన వెంటనే పలువురు ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు,సహచరులు సంతాపం ప్రకటించారు.ప్రదీప్‌కుమార్ సేవలుచిరస్మరణీయమని కొనియాడుతూ, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని పలువురు హామీ ఇచ్చారు.బుధవారం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి,ప్రదీప్ మృతికి నివాళిగా ఆయన స్నేహితులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

# రేషన్ షాపులపై తనిఖీ నిర్వహించిన చీరాల ఆర్డీఓ



**వేటపాలెం, జూన్ 3, ప్రభాతవార్త**

రేషన్ సరుకులను రేషన్ షాపులోనే పంపిణీ చేసే నేపథ్యంలో మంగళవారం నాడు చీరాల ఆర్డీఓ వేటపాలెం మండల తహశీల్దార్‌తో కలిసి కొత్తపేటలోని 32, 33, 35 షాపులను విజిట్ చేయడం జరిగింది. 65 సంవత్సరాలు పైబడిన వారు, దివ్యాంగులు ఉన్న ఇంటికి నేరుగా రేషన్ షాపు డీలర్ రేషన్ ఇవ్వడం జరుగుతుందని,రేషన్ షాపులో లబ్దిదారులకు ఇబ్బంది లేకుండా మంచినీళ్లు, నీడ ఉండేలా ఏర్పాటు చేసుకోవాలని, లబ్దిదారులకు ఎటువంటి అసౌకర్యం కలుగని రీతిలో సరుకు పంపిణీ చేయాలని, ఆర్డీఓ డీలర్లకు తెలియజేశారు.

# నేడు విద్యుత్ సరఫరాకి అంతరాయం



**వేటపాలెం, జూన్ 3, ప్రభాతవార్త**

వేటపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని టౌన్ సెక్షన్ నందు విద్యుత్‌లైన్ల మరమ్మత్తుల దృష్ట్యా బుధవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దేశాయిపేట పంచాయతీ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. కావున దేశాయిపేట పంచాయతీ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని వేటపాలెం టౌన్ ఏఈ అరుణకుమారి కోరారు.

# గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం




**వేటపాలెం, జూన్ 3, ప్రభాతవార్త**

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా హారిజోన్ పబ్లిక్ స్కూల్ ప్రారంభించడం జరిగిందని స్కూల్ సెక్రటరీ డాక్టర్ పొగడ దండ రవికుమార్ తెలిపారు. వేటపాలెం మండలం రామన్నపేట విలేజ్ నందు హారిజోన్ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవ ముందస్తు కార్యక్రమంలో పాల్గొన్న పత్రికా మిత్రులతో డైరక్టర్ పొగడ దండా రవికుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా హారిజోన్ పబ్లిక్ స్కూల్ ప్రారంభించడం జరిగిందని, మండలంలోని పేద, సామాన్య కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలన్న తపనతో ఈ పాఠశాలను నిర్మించినట్లు తెలిపారు. విద్య అందరికి అందుబాటులో ఉండాలనే ఆశయంతో ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. మూడు ఎకరాల మామిడి తోట మధ్యలో ఆహ్లాదకరమైన ప్రకృతి వాతావరణంలో ఏర్పాటు చేసిన ఈ పాఠశాల పిల్లలను ప్రకృతితో మమేకమయ్యేలా తీర్చిదిద్దబడిందని డైరక్టర్ తెలియజేశారు.

# ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం




**వేటపాలెం, జూన్ 3, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి పసుమర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేటపాలెం, ఈపురు పాలెం పందిళ్ళపల్లి, చిన్నగంజాం, సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నందు జూన్ 5వ తేదీ తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ,ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల మూడవ రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మనకు రావాల్సిన మధ్యంతర భృతిని ప్రకటించాలని, సీపీఎస్ రద్దు చేయాలని, 12వ పీఆర్సీ కమీషన్‌ను ఏర్పాటు చేయాలని, కాంట్రాక్టు,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్దీ కరించాలని, సుమారు 14 ప్రధానమైన డిమాండ్లతో మన రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా వైస్ ప్రెసిడెంట్ జే.సుధాకరరావు, మధుసూదన్‌రావు, మార్తమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

**- జూన్ 6 నుంచి 16 వరకూ అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు - 13వ తేది కళ్యాణం, రథోత్సవం**

**- భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు - బ్రహ్మోత్సవాలను పటిష్ట పోలీస్ బందోబస్తుతో - ప్రశాంతంగా నిర్వహించాలి : మంత్రి స్వామి**

**సింగరాయకొండ, జూన్ 1 ,ప్రభాతవార్త**

మండలంలో దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాత సింగరాయకొండ శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. జూన్ 6 నుండి 16 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి.ఈ పదకొండు రోజుల్లో స్వామివారు నిత్యం వివిధ వాహనాలపై భక్తులకు దర్శనమిస్తారు.ప్రకాశం, నెల్లూరు జిల్లాలతో పాటు సుదూర ప్రాంతాలు నుండి వేలాది మంది భక్తులు ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొననున్న నేపథ్యంలో,ఆలయ అధికారులు అన్ని సౌకర్యాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు వారు వివరించారు.భక్తులు రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పోలీసు,రెవెన్యూ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు.ట్రాఫిక్ నియంత్రణ, రద్దీ నివారణ, అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఉండేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఆలయ పరిసర ప్రాంతాలు, మాడ వీధులను పోలీస్, రెవిన్యూ అధికారుల బృందం పరిశీలించి భక్తులు, ప్రజలు సహకరించాలని కోరారు.

**బ్రహ్మోత్సవ వివరాలు..**

ఆరవ తేదీ శుక్రవారం రాత్రి అంకురార్పణ, ఏడవ తేదీ శనివారం ఉదయం ధ్వజారోహణం రాత్రి చంద్రప్రభ వాహనం, 8 వ తేదీ ఆదివారం ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి హంస వాహనం, 9వ తేదీ సోమవారం ఉదయం చప్పర సేవ వాహనం, రాత్రి శేష వాహనం, 10వ తేదీ మంగళవారం ఉదయం చప్పరసేవ, రాత్రి హనుమంత సేవ, 11వ తేదీ బుధవారం ఉదయం మోహిని ఉత్సవం,రాత్రి గరుడ సేవ, 12వ తేదీ గురువారం ఉదయం చప్పర సేవ,సాయంత్రం వసంతోత్సవం, రాత్రికి గజోత్సవం, 13వ తేదీ శుక్రవారం ఉదయం కళ్యాణం,సాయంత్రం రథోత్సవం, 14వ తేదీ శనివారం ఉదయం చప్పర సేవ వాహనం, రాత్రికి అశ్వవాహన సేవ, 15వ ఆదివారం తేదీ ఉదయం చక్రస్థానం, లక్ష్మీ సంవాద ఉత్సవం, రాత్రికి ధ్వజావరోహణం, 16వ తేదీ సోమవారం రాత్రి శ్రీ పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

**సాంస్కృతిక కార్యక్రమాలు వివరాలు..**

10 వ సత్యాహరిచంద్ర,శ్రీ కృష్ణ యాదవ్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో చండిమేళం, బండలాగుడు పోటీలు, 11 తేదీ సిని పాట కచేరి, రథదు పోటీలు, 12 వ తేది కూచిపూడి నాటకం, భక్త చింతామణి, పాట కచ్చేరి, కరెంట్ ప్రభ, 13 వ తేదీ శ్రీకృష్ణ యాదవ్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం

**బ్రహ్మోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి మంత్రి స్వామి..**

జూన్ 6 నుండి 16 వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలను గత అనుభవాలు దృష్ట్యా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పరస్పర సమన్వయంతో ప్రశాంతంగా నిర్వహించాల్సిందిగా మంత్రిస్వామి ఆదేశించారు. భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, భద్రత పరంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

**ఆలయ చరిత్ర..**

పురాణంలో దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన సింగరాయకొండ మండలం, పాత సింగరాయకొండ గ్రామంలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి, శ్రీ యోగానంద లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయ విశిష్టత, పర్ణశాలలో దేవ ఋషి నారద మహామునికి ప్రత్యక్షమైన ఈ క్షేత్రంలో శ్రీ యోగానంద లక్ష్మి నరసింహ స్వామి వారు తూర్పు సముద్రపు పొంగును నిగ్రహించుకో నున్నట్లు మహోగ్రాదృష్టి కరాలముతో సముద్రమునకు రెండు క్రోసుల దూరంలో వెలసి యున్నారు. త్రేతాయుగంలో శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీరామచంద్రుని చేత శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి అనుగ్రహంతో దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి ప్రతిష్ట చేయుట జరిగియున్నది.ఈ ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రంలో వీరాంజనేయ స్వామి వారు స్వయంభువుగా వెలసియున్నారు. ఆంధ్రరాజా శతాబ్దిలో గల పల్లవ రాజుల కాలం నుండి కలియుగ బోజబిరుదాంకితులైన విజయనగర సామ్రాజ్య ప్రభువైన శ్రీకృష్ణదేవరాయల అనంతరం వరకు అనేక రాజులు స్వామివారిలను సేవించి అనేక దానములు భూరి విరాళములు ఇచ్చినట్లు ఇక్కడ శాసనములు తెలుపుతున్నాయి.స్వామి వారికి ఉదయం దద్దోజనంతో శ్రీ యోగా నంద లక్ష్మీ నరసింహస్వామి వారికి బాలభోగం ఆరగింపు చేయుట ఇక్కడ ప్రత్యేకతగా అర్చకులు చెప్తున్నారు.ఈ బ్రహ్మోత్సవాలును బ్రహ్మదేవునిచే జ్యేష్ఠ మాసంలో నిర్ణయింపబడిన బ్రహ్మోత్సవం వైఖనస ఆగమ ప్రకారం ఈ సంవత్సరం విశ్వావసు నామ సంవత్సరం జ్యేష్ఠ మాసం శుద్ధ ఏకాదశి శుక్రవారం 6 వ తేది నుండి 16 వరకు జరుగునున్నాయని విజ్ఞులు నిర్ణయించారు.

**సంతానయోగ క్షేత్రంగా గుర్తింపు..**

ఈ బ్రహ్మోత్సవాలలో జరిగే ధ్వజారోహణం రోజు సంతానం లేని మహిళాలు గరుడ ప్రసాదం స్వీకరించి 9రోజులు నియమ నిష్టలతో ఉండి ధ్వజావరోహణ రోజు సాయంత్రం మరల కూడా స్వామి వారి ప్రసాదమును సేకరించిన వారికి సంతాన ప్రాప్తి కలుగుతుందని ఇక్కడ భక్తులు నమ్మకం.ఈ క్షేత్రం ఈ విధంగా ప్రతిష్ట కలిగియున్నది. బ్రహ్మోత్సవాలుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించవలసిందిగా ఆలయ అధికారులు తెలిపారు.

**కప్పం కట్టిన బ్రిటిష్ వారు..**





ఈ క్షేత్రంలో శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి తూర్పు వైపున ఐదు మైళ్ల దూరంలో ఉన్న సముద్రంలో స్వామివారి మహోగ్ర దృష్టి పడి పడవలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. ఇది గమనించిన అప్పటి బ్రిటిష్ వారు చుట్టుపక్కల ప్రాంతాలను అన్వేషించుకుంటూ స్వామివారి ఆలయం వద్దకు చేరుకున్నారు.ఈ స్వామి వారి మహోగ్ర దృష్టి వల్లే ఈ విధంగా జరుగుతుందని వారు స్వామి గర్భలయ ప్రధాన గడపను పక్కకు జరిపారు. ఈ కారణం చేత బ్రిటిష్ వారు అప్పట్లో ఒక్క రూపాయి వంతున కప్పం కట్టినట్లు ఇక్కడ ఆధారాలు ఉన్నాయి.

**తాత స్వామి ఆ పేరు ఎలా వచ్చింది..**

యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారికి నిత్యం పూజలు నిర్వహించే అర్చకులు వారు వారి యొక్క బాలుడును దేవాలయంలో మరిచి ఇంటికి వెళ్లారు.మరుసటి రోజు అర్చకుల వారు యథా విధిగా ఆలయంలోకి వెళ్లి చూడగా బాలుడు ఉన్నాడు.ఆలయంలోపల ఒక్కడివే ఎలా ఉన్నావని బాలుడు ను అడగగా తాత స్వామి వారు వచ్చి పెరుగు అన్నం పెట్టి వెళ్లారని తెలిపారు. అప్పటినుండి ఈ స్వామి వారిని తాత స్వామి వారని కూడా పిలుస్తారు.

# వెన్నుపోటు గొడ్డలివేటు పేటెంటు జగన్‌దే

- తల్లికి చెల్లికి వెన్నుపోటు, బాబాయికి గొడ్డలి వేటు
- ప్రజలు భూస్థాపితం చేసినా వైసీపీ నాయకులకు బుద్ధి రాలేదు
- సైకో మనస్థత్వం మారలేదు
- రాష్ట్రానికి పట్టిన పీడ వదిలిందని ప్రజలు ఏడాదిగా ఆనందంగా ఉన్నారు
- వైసీపీ వారి కేసుల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఈ డ్రామా
- వైసీపీ రాసలీలల పార్టీ
- 4న వైసీపీ పీడ వదిలి ఏడాది కూటమి ఏడాది సుపరిపాలన విజయోత్సవం
- మీడియాతో చీరాల తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్

**చీరాల, జూన్ 3, ప్రభాతవార్త**

వెన్నుపోటు, గొడ్డలివేటుకు పేటెంట్లు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌దేనని ధ్వజమెత్తారు. ప్రజలు ఆ పార్టీని స్థాపితం చేసి 11 సీట్లకు పరిమితం చేసినా వైసీపీ నాయకులకు బుద్ధి రాలేదని ఆయన మండిపడ్డారు. చీరాల క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఆదేశానుసారం తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్ మీడియాతో మాట్లాడుతూ రేపు వైసీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిర్వహించడం హాస్యాస్పదమని, అది వైసీపీకి తద్దినం పెట్టే రోజుగా నిర్వహించుకుంటే బాగుంటుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అసలైన వెన్నుపోటుదారుడు జగనేనని విమర్శించారు. ఆస్తి కోసంతల్లిని చెల్లిని జగన్ ఇంట్లో నుంచి బయటకు నెట్టేశాడని అంతకన్నా పెద్ద వెన్నుపోటు ఏముంటుందని ప్రశ్నించారు. చిన్నాన్నపై గొడ్డలి వేటు అందరికి తెలిసిందే అన్నారు. రాష్ట్రానికి పట్టిన పీడ వదిలిందని, ప్రజలు ఏడాదిగా ఆనందంగా ఉన్నారని, మద్యం, క్వార్జ, ఖనిజం కేసుల్లో వైసీపీ వారు ఉన్నందున ఆ కేసుల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు వెన్నుపోటు దినం డ్రామాలు నిర్వహిస్తున్నారని ఆయన విమర్శించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎన్నో అరాచకాలు ఎన్నో వేదింపులతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారని, కూటమి అధికారంలోకి వచ్చాక ఏడాదిగా ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడుకుంటున్నారని గౌరీ అమర్నాథ్ అన్నారు. జగన్ హయాంలో సంక్షేమ పథకాలకు వెన్నుపోటు పొడిచి ఆ నిధులను దారి మళ్లించారని ఆయన మండిపడ్డారు. కార్మికులకు అన్యాయం చేశారని, మెగా డీఎస్సీ వేయకుండా నిరుద్యోగ యువతకు వెన్నుపోటు పొడిచారని, ఇలా అనేక విధాలుగా వెన్నుపోటు పొడిచిన వైసీపీ రేపు వెన్నుపోటు దినం నిర్వహించడం హాస్యాస్పదమని విమర్శించారు. జగన్ ప్రభుత్వ పీడ వదిలి ఏడాది కూటమి ఏడాది సుపరిపాలన అని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తుంటే ప్రజలు ఆశీర్వదిస్తున్నారని ఆయన వివరించారు. చిత్తుగా ఓడినా వైసీపీ ఈ ఏడాదిలో బాధ్యతగా వ్యవహరించి ప్రజల పక్షాన పోరాడిన దాఖలాలు లేవని, ఆ పార్టీకి కూటమి ప్రభుత్వం ఆ అవకాశం ఇవ్వలేదని ఆయన వ్యాఖ్యానించారు. రాజకీయంగా భూస్థాపితం అయిన వైసీపీకి ఉనికి కాపాడుకోవడానికి వేస్తున్న వేషాలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. ఓడినా వైసీపీకి వారి సైకో మనస్థత్వం మారలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం కళ్ల వేరు, వైసీపీ వారి కళలు వేరని, కూటమి ప్రభుత్వం కూచిపూడి, భరత నాట్యం చిత్రలేఖనం ప్రోత్సహిస్తుంటే, వైసీపీ గోరంట్ల మాధవ్, అంబటి రాంబాబు లాంటి జాతి రత్నాలు కళా విన్యాసాలు చేస్తుంటారని ఆయన ఎద్దేవ చేశారు. వైసీపీ రాసలీలల పార్టీ అని ఆరోపించారు. రేషన్ దుకాణాల్లో రేషన్ ఇవ్వడం వల్ల ప్రజలు తమకు అనుకూలంగా ఉన్న సమయంలో వెళ్లి తీసుకోవచ్చని, గతంలో మాదిరి ఎండియూ వాహనం ఫ్పుడూ వస్తుందో అని పనులు మానుకుని ఇళ్ల వద్ద ఎదురు చూడనవసరం లేదని ఆయన చెప్పారు. ప్రతి నెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సాయంత్రం నాలుగు నుంచి రాత్రి 8గంటల వరకు రేషన్ తీసుకునే అవకాశం ఉందని చెప్పారు. వికలాంగులకు, 65 ఏళ్ల దాటిన వృద్ధులకు ఇంటికి వెళ్లి రేషన్ ఇస్తారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేవం పార్టీ సీనియర్ నాయకులు వీరభద్రయ్య, ఎంసీ చైర్మన్ జనార్ధన్, చీరాల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గంజి పురుషోత్తం, గుమ్మా వెంకటేష్, పూర్ణ, పోతురాజు, పులి వెంకట నారాయణ, తేలప్రోలు నాగేశ్వరరావు, బాలచంద్ర, చప్పిడి వెంకటరావు, కర్నేటి శ్రీను, వెంకటేశ్వరరావు, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# పంట సాగు పత్రాలపై వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ




**సంతనూతలపాడు, జూన్ 3, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నాడు పంట సాగు పత్రాలపై జారిపై మండల స్థాయి వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మండల వ్యవసాయాధికారిణి పి.పావని ,మండల తహశీల్దార్ వేమూరి ఆదిలక్ష్మీ దీనిని పర్యవేక్షించారు. ఈ ఏడాది సంతనూతలపాడు మండలానికి 11 29 పంట సాగు హక్కు పత్రాలు, టార్గెట్‌గా ప్రభుత్వం నిర్ణయించినట్లు ఈ సందర్భంగా సంతనూతలపాడు తహశీల్దార్ వేమూరి ఆదిలక్ష్మీ పేర్కొన్నారు. కౌలుకు సాగు చేసే రైతులను గుర్తించి పంట సాగు హక్కు పత్రాలను కౌలు రైతులకు అందించాలని తహశీల్దార్ ఆదిలక్ష్మీ ఈ సందర్భంగా సూచించారు. కౌలు రైతులకు 11 నెలల కాల వ్యవధిలో వీటిని ఇవ్వడం జరుగుతుందన్నారు. భూమి మీద ఎలాంటి హక్కులు కౌలు రైతులకు ఉండదన్నారు. భూ యజమానులు ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రంలు ఇవ్వడానికి ఇందుకు సహకరించాలని తహశీల్దార్ ఆదిలక్ష్మీ పేర్కొన్నారు. పంట సాగు హక్కు పత్రములు పొందిన రైతులకు మాత్రమే వ్యవసాయ శాఖలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలైన అన్నదాత సుఖీభవ, పంటల బీమా పథకం, ప్రభుత్వం వారు నిర్వహించే కొనుగోలు కేంద్రాల్లో రైతు తాను పండించిన పంటలను మద్దతు ధరకు అమ్ముకోవడం, ప్రకృతి వైపరీత్యాల సంభవించినప్పుడు పంట నష్టపరిహారం, బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు వడ్డీ రాయితీ, సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ పథకాలకు ఈ మేరకు కౌలు రైతులు అర్హులవుతారని మండల వ్యవసాయాధికారిణి పి.పావని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఎస్.వెంకటరావు, కేవీ సుబ్బారెడ్డి, గ్రామాల వ్యవసాయ సహాయకులు, గ్రామాల రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అసలైన వెన్నుపోటు దారుడు జగన్‌రెడ్డి

**- ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్**



**సంతనూతలపాడు, జూన్ 3, ప్రభాతవార్త**

అసలైన వెన్నుపోటు దారుడు జగన్‌రెడ్డి అని, వెన్నుపోటు అంటూ దర్నాలు చేయడం దొంగే దొంగ అన్నట్లుగా ఉందని, జగన్ ముఠా దుష్ప్రచారాలు తిప్పికొట్టి అభివృద్ధి, సంక్షేమాన్ని నిలబెట్టుకోవాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. కుంభ కోణాల నుంచి ప్రజా దృష్టి మళ్లించడానికే ధర్నాల డ్రామా ఆడుతున్న జగన్ ముఠా అని అన్నారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా తొలి ఏడాదిలోనే 70 శాతం హామీలు అమలు చేసిన కూటమి ప్రభుత్వం అన్నారు. ఐదేళ్లలో 85శాతం హామీలకు ఎగనామం పెట్టిన జగన్ సర్కార్ అన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన జింకా వెంకట నరసయ్య తన బెరైటీస్ మైన్లో జగన్ తాత రాజారెడ్డికి కొంత భాగస్వామ్యం కల్పిస్తే కృతజ్ఞత లేకుండా మైన్ ఓనర్‌ని హత్య చేసి ఆ మైన్‌ను రాజారెడ్డి కబ్జా చేశాడని, బీసీలకు వెన్నుపోటుతోనే జగన్ కుటుంబం బెరైటీస్ గని యజమాని అయ్యారన్నారు. కాంగ్రెస్‌ని అడ్డంపెట్టుకుని లక్షల కోట్లు దోచుకుని అదే పార్టీకి వెన్నుపోటు పొడిచి వైసీపీ పార్టీని స్థాపించారన్నారు. శివకుమార్ స్థాపించిన వైకాపా పార్టీని కబ్జా చేసి ఫాం శివకుమార్‌కు వెన్నుపోటు పొడిచారన్నారు. ఎత్తుకుని పెంచిన బాబాయిని గొడ్డలి వేటుతో నరికి చంపిన కిరాతకుల్ని కాపాడుతూ రక్త సంబంధానికి వెన్నుపోటు పొడిచారన్నారు. ఆస్తి కోసం తల్లి, చెల్లిని ఇంటి నుంచి గెంటేసి, కుటుంబ వ్యవస్థకే వెన్నుపోటు పొడిచారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎన్నో అరాచకాలు ఎన్నో వేదింపులతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారని, కూటమి అధికారంలోకి వచ్చాక ఏడాదిగా ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడుకుంటున్నారని అన్నారు. జగన్ హయాంలో సంక్షేమ పథకాలకు వెన్నుపోటు పొడిచి ఆ నిధులను దారి మళ్లించారని ఆయన మండిపడ్డారు. కార్మికులకు అన్యాయం చేశారని, మెగా డీఎస్సీ వేయకుండా నిరుద్యోగ యువతకు వెన్నుపోటు పొడిచారని, ఇలా అనేక విధాలుగా వెన్నుపోటు పొడిచిన వైసీపీ రేపు వెన్నుపోటు దినం నిర్వహించడం హాస్యాస్పదమని విమర్శించారు. జగన్ ప్రభుత్వ పీడ వదిలి ఏడాది కూటమి ఏడాది సుపరిపాలన అని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తుంటే ప్రజలు ఆశీర్వదిస్తున్నారని ఆయన వివరించారు. చిత్తుగా ఓడినా వైసీపీ ఈ ఏడాదిలో బాధ్యతగా వ్యవహరించి ప్రజల పక్షాన పోరాడిన దాఖలాలు లేవని, ఆ పార్టీకి కూటమి ప్రభుత్వం ఆ అవకాశం ఇవ్వలేదని ఆయన వ్యాఖ్యానించారు. రాజకీయంగా భూస్థాపితం అయిన వైసీపీకి ఉనికి కాపాడుకోవడానికి వేస్తున్న వేషాలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు.

Main tab page 2_2_Main tab page 2_2.qxd 6/4/2025 12:10 AM Page 1



## నేడు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**అద్దంకి, జూన్ 3, ప్రభాతవార్త**

అద్దంకి సబ్ డివిజన్ పరిధిలోని పలు గ్రామాలలో మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం వుంటుందని ఎడి ఎం. దామోదరం ఒక ప్రకటనలో తెలిపారు. అద్దంకి పట్టణంలోని భవానీ సెంటర్, మున్సిపల్ కార్యాలయ రోడ్డు, బంగ్లారోడ్డు, బస్టాండ్ ఏరియా, కాకానిపాలెంలలో బుధవారం ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా అద్దంకి మండలంలోని 33/కెవి కుంకుబాడు ఫీడర్, కొరిశపాడు మండలంలోని సోమవరప్పాడు గ్రామం, పంగులూరు మండలంలోని పంగులూరు గ్రామంతోపాటు ఆపరిసరాలలోని పరిశ్రమలకు కూడ విద్యుత్ సరఫరాలో అంతరాయం వుంటుందని వివరించారు. ఈనేపద్యంలో విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఎడి ఎం.దామోదరం కోరారు.

## వైసిపి ఆధ్వర్యంలో నేడు నిరసరన కార్యక్రమం

**అద్దంకి, జూన్ 3, ప్రభాతవార్త**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రపార్టీ పిలుపు మేరకు బుధవారం అద్దంకిలో నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పానెం చిన్న హనిమిరెడ్డి నాయకత్వంలో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ విడదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. వెన్నుపోటు దినం పేరుతో నిరసన కార్యక్రమం ఉదయం 9.30గంటలకు 20వ వార్డులోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నుంచి, ప్రారంభమౌతుందని, తెలిపారు. ముందుగా రాజశేఖరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి అక్కడ నుండి శాంతియుత ర్యాలీతో ప్రారంభమై అమరజీవి పొట్టి శ్రీరాములు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగి, తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పిస్తారని వివరించారు. ఈ కార్యక్రమానికి నియోజకర్గంలోని వైఎస్ఆర్ సిపి అన్నీ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నాలని కోరారు.

## పలు ప్రాంతాలలో విద్యుత్ కటింగ్

**అద్దంకి, జూన్ 3, ప్రభాతవార్త**

అద్దంకి పట్టణంతోపాటు ధర్మవరం, పమిడిపాడు, రామకూరు, సబ్‌స్టేషన్‌ల పరిధిలో, భవానీసెంటర్, దర్శి రోడ్డు, గాంధీబొమ్మసెంటర్‌ల పరిధిలో మరమ్మత్తుల నిమిత్తం సోమవారం ఉదయం 9గంటల నుండి, మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దామోదరం ఒక ప్రకటనలో తెలిపారు. అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో భవానీసెంటర్, దర్శిరోడ్డు, గవర్నమెంట్ ఆసుపత్రి వైపు, ఎన్‌టిఆర్ నగర్, పాతదామావారిపాలెం, కట్టకిందపాలెం, పెరికపాలెం, గాంధీబొమ్మ సెంటర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ధర్మవరం సబ్‌స్టేషన్ పరిధిలో ధర్మవరం, పమిడిపాడు సబ్‌స్టేషన్ పరిధిలో పమిడిపాడు గ్రామం, రామకూరు సబ్‌స్టేషన్ పరిధిలో రామకూరు గ్రామంలో ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు సాంకేతిక పరమైన లోపాలను సరిచేసేందకు, విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఎడి దమోదరం తెలిపారు.

## దళిత యువకులపై ఖాకీల ధమనకాండ

**- ఉప ముఖ్యమంత్రి విచారణ జరిపించాలి**

**- సి.ఐ.లపై చర్య తీసుకోవాలి - నీలం డిమాండ్**

**అద్దంకి, జూన్ 3, ప్రభాతవార్త**





దళిత న్యాయదేవత హోం మంత్రి అనిత వ్యాఖ్యలు చట్ట విరుద్ధమైనవని, దళితుల ఆత్మరక్షణ ర్యాలీలో దళిత నేత నీలం నాగేంద్రం అన్నారు. మంగళవారం అద్దంకిలో దళితుల ఆత్మరక్షణ ర్యాలీ బంగ్లారోడ్డులో అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించారు. తెనాలిలో దళిత యువకులపై ఖాకీల ధమనకాండపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌చే విచారణ జరిపించాలని నీలం నాగేంద్రం డిమాండ్‌చేశారు. తెనాలి టూటౌన్ సి.ఐ. త్రీటౌన్ సి.ఐ.లపై చర్యలు తీసుకోవాలని, జనసేన నుండి మంత్రి వర్గంలో ప్రాతినిద్యం వహిస్తున్న నాదెండ్ల మనోహర్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెంటనే మంత్రి వర్గం నుంచి తొలగించాలని నీలం నాగేంద్రం డిమాండ్‌చేశారు. గతంలో విశాఖపట్నంలో డాక్టర్ సుధాకర్‌పై నడిరోడ్డులో పోలీసులు దాడిచేసి, కొట్టినప్పుడు ప్రతిపక్ష నేతగా వున్న అనిత డాక్టర్ సుధాకర్ ఇంటికి వెళ్ళి పరామర్శించలేదా, అని నీలం నాగేంద్రం ప్రశ్నంచారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో యానాది సేవా సమితి నాయకులు పోలా జీవరత్నం, ఆదినారాయణ, ఎం.ఆర్‌పిఎస్ నాయకులు, యోహను, అంబేద్కర్ పోరాట వేదిక కన్వీనర్ యర్రమల్ల శ్రీనివాసరావు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయానికి సిద్ధమవుతున్న రైతులు

**- నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయండి - ఎ.ఒ. సుబ్బారెడ్డి**

**జె.పంగులూరు, జూన్ 3, ప్రభాతవార్త**



మండలంలోని బైటమంజులూరు, రామకూరు గ్రామాలలో రైతు సేవా కేంద్రాలలో ఖరీఫ్ సాగు సమాయత్తం కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి రైతులకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ.ఒ.సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం రుతుపవనాలు ప్రవేశం, అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున గ్రామాల వారీగా రైతులు వ్యవసాయ పనులకు సింసిద్దమవుతున్నారన్నారు. ప్రతి రైతు నాణ్యత కలిగిన, మేలైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో విధిగా బిల్లు తీసుకుని దాచుకోవాలన్నారు. 50శాతం రాయితీపై పచ్చిరొట్ట, విత్తనాలు జీలుగా రు.61.50 కెజీలు, జనుము రు.54కెజీలపై రైతు సేవా కేంద్రంలో రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అన్నారు. ఖరీఫ్‌లో సాగర్ నీటిని విడుదల చేసిన వెంటనే వరి విత్తనాలుతో నారుమళ్ళ వేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, పృధ్వీసాయి, ఆయా గ్రామ రైతులు పాల్గొన్నారు.

## డీలర్లకు, విఆర్‌ఓలకు అవగాహన కార్యక్రమం

**జె.పంగులూరు, జూన్ 4, ప్రభాతవార్త**

మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో డీలర్లకు, విఆర్‌ఓలకు ప్రజలకు రేషన్ పంపిణీలపై అవగాహన కార్యక్రమాన్ని తహశీల్దార్ పి. సింగరావు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ 65 సంవత్సరాలు పైబడిన వారికి, వికలాంగులకు వారి ఇంటికి వద్దనే బియ్యం, పంచదార పంపిణీ చేయాలని విఆర్‌ఒ ప్రతి కార్డుదారుల ఇంటికి వెళ్ళి వివరించాలన్నారు. ప్రతి నెల 1వ తేది నుండి 15వ తేది వరకు ఉదయం 8గంటల నుండి 12 గంటల వరకు సాయంత్రం 4గంటల నుండి 8గంటల వరకు కార్డు దారులు ఎప్పుడు వచ్చినా డీలర్లు, బియ్యం ఇవ్వాలని, కార్డుదారులతో కఠినంగా వ్యవహరించకూడదని గౌరవంగా మాట్లాడాలని, ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగరానిది జరిగితే పూర్తి బాధ్యత డీలరు వహించాలన్నారు. కార్డు దారులకు అసౌకర్యం కలిగించిన నిర్లక్ష్యంగా వ్యవహరించిన డీలర్లే బాధ్యులౌతారన్నారు. 34మంది డీలర్లు, 12మంది విఆర్‌ఒలు, ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



## పంట సాగుదారుల హక్కు పత్రం జారీపై అవగాహన కార్యక్రమం

**అర్ధవీడు, జూన్ 3, ప్రభాతవార్త**





అర్ధవీడు మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సిహెచ్ నాగార్జున రెడ్డి, ఏఓ షేక్ మహమ్మద్‌ల ఆధ్వర్యంలో పంట సాగుదారుల హక్కు పత్రం జారీపై గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బందికి మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సిహెచ్ నాగార్జునరెడ్డి, ఏఓ షేక్ మహమ్మద్‌లు మాట్లాడుతూ పంట సాగుదారుల హక్కు చట్టం 2019పై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క కౌలురైతు తప్పనిసరిగా సిసిఆర్‌సి కార్డు పొందేలా చూడాలని, సిసిఆర్‌సి కార్డు వలన కౌలురైతుకు ప్రభుత్వం అందించే పంట రుణాలు, పంట భీమా పథకం, అన్నదాత సుఖీభవ పథకం, ఇన్‌పుట్ సబ్సిడీ పొందటానికి కౌలు రైతులు తప్పనిసరిగా సిసిఆర్‌సి కార్డు కలిగి ఉండాలని తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ వ్యవసాయ సహాయకులు సమన్వయంతో గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి కౌలు రైతులను గుర్తించి వారి అప్లికేషన్‌కు కావలసిన పత్రాలు సమర్పించి సిసిఆర్‌సి కార్డు పొందేలా చూడాలని తెలిపారు. పంట సాగు హక్కుదారు చట్టం 2019 సెక్షన్(3)(8) ప్రకారం నిర్దేశిత కాలపరిమితి 11నెలలు మాత్రమే ఉంటుందని 11నెలల తర్వాత భూ యజమాని వలన పంటసాగు దారునితో లేకా వేరేవారితో ఒప్పంధం చేసుకోవాలని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌ను నిషేదిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం..

**- ఎంపిడిఓ రమణారెడ్డి**

**గిద్దలూరు, జూన్ 3, ప్రభాతవార్త**






ప్లాస్టిక్‌ని నిషేదిద్దాము.. పర్యావరణాన్ని కాపాడుదాము అని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రమణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కృష్ణంశెట్టిపల్లె గ్రామ సచివాలయం పరిధిలో ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించడమైనది. అనంతరం షాపుల దగ్గర సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం గురించి జూట్ బ్యాగుల మరియు గుడ్డ సంచుల వాడకము గురించి షాపు యజమానులకు మరియు ప్రజలకు వివరించారు. షాపులకు వచ్చే వారు కూడా ఖచ్చితంగా గుడ్డసంచులను వెంటతెచ్చుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామంలోని రామాలయం దగ్గర పర్యావరణాన్ని కాపడటానికి నా దైనందిన జీవితంలో సాధ్యమయ్యే అన్ని మార్పులు చేస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. పర్యావరణ అనుకూల అలవాట్ల ప్రాముఖ్యత గురించి నా కుటుంబము, నా స్నేహితులు మరియు ఇతరులను నిరంతరం ప్రేరిపించడానికి కూడా నేను కట్టుబడి ఉన్నాను అని ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జేసి చెన్నారావు, ఎస్‌బిఎం ఆర్‌సి బాబురావు, పంచాయితీ కార్యదర్శి రాఘవరావు, గ్రామ సర్పంచ్ దాసరి ఎలిజబెత్ అబ్రహం, సచివాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట ఆడుతున్న నలుగురు అరెస్ట్

**గిద్దలూరు (కొమరోలు), జూన్ 3, ప్రభాతవార్త**



కొమరోలు మండలం ఎడమకల్లు గ్రామ సమీపంలోని పొలాల్లో పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు పేకాట రాయుళ్ళను మంగళవారం ఎస్సై నాగరాజు అదుపు లోకి తీసుకున్నారు. పేకాట ఆడుతున్న వారి వద్ద నుంచి రూ.4200నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై నాగరాజు వెల్లడించారు. పేకాట ఆడడం చట్టరిత్యా నేరమని, అటువంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలో జూదం, అసాంఘిక కార్య కలాపాలు జరుగుతుంటే 9121102190 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

## వెన్నుపోటు దినం కాదు.. పశ్చతాపదినం చేసుకోండి - మద్దినేని హరిబాబు

**సంతనూతలపాడు, జూన్ 3, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ రాక్షస పాలనకు సరిగ్గా ఏడాది క్రితం ప్రజలు చరమగీతం పాడారని సంతనూతలపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మద్దినేని హరిబాబు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజలనుతీవ్రంగా వేదించిన నాటి పాలకులకు ఎన్నికల ఫలితాల ద్వారా ప్రజలు చాచికొట్టినట్లు బుద్ధి చెప్పారని ఆయన అన్నారు. గత ఐడియాలలో ప్రజలకు చేసిన మోసానికి జగన్ నిజానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలని, కానీ అందుకు భిన్నంగా వెన్నుపోటు దినం అంటూ కొత్త నాటకాలకు తెరలేపారని ఆయన ఎద్దేవ చేశారు. జూన్4 వ తేదీ వైసీపీ నాయకులు పశ్చత్తాప దినంగా జరుపుకోవాలని ఆయన హితవు పలికారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు మేలు జరుగుతుండటాన్ని చూసి వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని, అందుకే వారికి అలవాటైన రీతిలో అబద్దాలను ప్రచారం చేస్తున్నారని హరిబాబు మండిపడ్డారు. తల్లి, సొంత చెల్లెలకే వెన్నుపోటు పొడిచిన చరిత్ర ఉన్న జగన్‌ను ప్రజలు ఎలా విశ్వసిస్తారని ఆయన ప్రశ్నించారు. ఆయన ఇదే వైఖరితో ముందుకు సాగితే రాష్ట్రంలో వైసీపీ పరిస్థితి దిగజారుతుందని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సుపరిపాలన అందిస్తుందని, దానిని ఓర్వలేని వైసీపీ నేతలు అవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ఇంకా హరిబాబు మాట్లాడుతూ సంవత్సర ప్రజా పరిపాలన కాలంలో ప్రజలకు హామీ ఇచ్చినట్లు బకాయిలతో కలిపి పెన్షన్ల చెల్లింపు ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ దీపం, పథకం కింద మూడు ఉచిత గ్యాస్ సిలిండర్, గత ప్రభుత్వంలో స్పౌస్ పెన్షన్‌కు నోచుకోని 79 వేల మందికి పెన్షన్ చెల్లింపు, రేషన్ కార్డులకు చేర్పులు, మార్పులు, ఆరోగ్యశ్రీలో కవరు కాని జబ్బులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుండి బిల్లులు చెల్లింపు, గుంతలు లేని రోడ్లు ఏర్పాటు, పరిపాలనలో జవాబుదారితనం పారదర్శకత, ప్రజా పరిపాలనకు మన మిత్ర యాప్ ద్వారా అనేక సేవలు ప్రజలకు చేరువ చేయడం, గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం, రూ.4లక్షల కోట్ల పెట్టుబడుల ప్రవాహం, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడటం, నిధులు రాబట్టి అమరావతి, పోలవరంను పరుగులు పెట్టించడం శాంతి భద్రతలను కాపాడటం ఇంకా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సంవత్సర కాలం నుండి చేపడుతున్న ఈ ప్రభుత్వాన్ని వెన్నుపోటు ప్రభుత్వ దినంగా జూన్ 4న వైసీపీ చేపడుతున్న ర్యాలీని ప్రజలందరూ తిరస్కరించి ఆ పార్టీకి తగిన సమయంలో తగిన విధంగా బుద్ది చెప్పాలని మండల ప్రజలందరిని కోరారు. మండల పార్టీ నాయకులు, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ పత్రికా సమావేశంలో పాల్గొని జూన్4వ తేదీన వైఎస్సార్‌సీపీ చేపడుతున్న వెన్నుపోటు దినోత్సవ ర్యాలీని వైసీపీ పార్టీ తద్దినం ర్యాలీ దినంగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు బొడ్డు శంకర్, మండల తెలుగు యువత అధ్యక్షుడు ముప్పరాజు శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి తాటితోటి నరసింహారావు, బాపట్ల పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పావులూరి నారాయణస్వామి చౌదరి, బాపట్ల పార్లమెంట్ పీఎన్‌టీయుసీ ఉపాధ్యక్షులు చెరుకూరి వెంకట సుబ్బయ్య, సాదినేని శ్రీరామమూర్తి, బొడ్డపాటి చంద్రశేఖర్, మార్పుడి అంజయ్య, గుంటూరు రంగనాయకులు, పెరికల మోహన్, బొడ్డు సాయి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## వెన్నుపోటు దినోత్సవాన్ని విజయవంతం చేయండి

**- వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త అన్నా**

**మార్కాపురం, జూన్ 3, ప్రభాతవార్త**



కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగొడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 4వ తేదీన నిర్వహించు వెన్నుపోటు దినోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మార్కాపురం నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అవలంభిస్తున్న దగాకోరు విధానాలను ప్రతి ఒక్కరు ఖండించాలని అన్నారు. కూటమి అంటూ జతకట్టి వచ్చిన నాయకులు అధికారంలోకి వచ్చి సంవత్సరకాలం గడిచినప్పటికి ప్రజలకు చేసిన మేలు ఏమి లేదని అన్నారు. 2004 జూన్ 4వ తేదీన అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని అన్నారు. సూపర్‌సిక్స్‌లో భాగమైన ఉచిత గ్యాస్ సిలిండర్ రెండో విడత నగదు చెల్లింపులు జరగలేదని, అమ్మ ఒడి పథకాన్ని అమ్మకు వందనముగా పేరు మార్చినప్పటికి అమలుపరిచే విషయంలో మల్లాగుల్లాలు పడుతున్నారని పేర్కొన్నారు. అవినీతిపై గళం విప్పే ప్రజలపై గళం నొక్కే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఈ నెల 4వ తేదీన గడియారస్తంభం సెంటర్లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆ అనంతరం ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరి వినతిపత్రం సమర్పించడం జరుగుతుందని కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## బండలాగుడు పోటీల కరపత్రాలను ఆవిష్కరించిన కదిరి బ్రదర్స్

**సీఎస్‌పురం, జూన్ 3, ప్రభాతవార్త**



సీఎస్‌పురం గ్రామంలో రాచూరి పెద్దమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా కాపు నాయుడులు ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన నిర్వహిస్తున్న బండలాగుడు పోటీల కరపత్రాలను మంగళవారం కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు సోదరులు కదిరి ప్రకాశ్‌రావు, పార్థసారధిలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌పురం ఎంపీటీసీ మన్నెపల్లి పెద్దన్న, మన్నెపల్లి రవికుమార్, మాజీ ఎంపీటీసీ మూరం కాశిరెడ్డి, మునగల నారాయణరెడ్డి, ఇరగని చలపతిరావు, పట్నం తిరుపతయ్య, కాశీం భాష, మాధవరావు, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షల ప్రకారమే మందులు వినియోగించాలి

**బల్లికురవ, జూన్ 3, ప్రభాతవార్త**



ప్రతి రైతు భూసార పరీక్షలు నిర్వహించి, వాటి ఫలితాల మేరకే పంటలకు ఎరువులు, పురుగు మందుల వినియోగం చేపట్టాలని వ్యవసాయాధికారి కుమారి అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు గ్రామాలలో ఖరీఫ్‌కు రైతుల సమాయత్తం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురుస్తున్నందున రైతులు పచ్చిరొట్ట పంటల సాగు చేపట్టి, భూసారాన్ని మరింతగా పెంచుకోవాలన్నారు. భూమిని కౌలుకు తీసుకున్న రైతులు సాగుదారు హక్కు పత్రాలు పొందడం ద్వారా ప్రభుత్వం అందజేసే అనేక సదుపాయాలను పొందగలుగు తారన్నారు. లైసెన్స్ ఉన్న డీలర్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి రసీదులు పొందాలన్నారు. అదే విధంగా పంట మార్పిడి విధానం చేపట్టడం ద్వారా చీడ పీడలను నివారించి, అధిక ఫలసాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు హనుమానాయక్, హరికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## సర్వవ్యాధుల నివారిణి యోగ

**బల్లికురవ, జూన్ 3, ప్రభాతవార్త**



యోగాంధ్ర ద్వారా సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్మాత్మకంగా నిర్వహిస్తుందని ఎంపీడీఓ కుసుమకుమారి అన్నారు. యోగ ద్వారా పని ఒత్తిడిలో ఎదుర్కొంటున్న సర్వవ్యాధులను నివారించవచ్చని ఆమె అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయ ఆవరణలో జరుగుతున్న యోగ శిక్షణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ప్రాణాయామం, మెడిటేషన్, సూర్యనమస్కారాలు తదితర యోగ ఆసనాల ఆరోగ్య ప్రయోజనాన్ని ఆయుష్ శిక్షకులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ విభాగం శిక్షకులతో పాటు 20 మంది వివిధ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## దళితులను బహిరంగంగా కొట్టిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

**- ఆదిమూలపు సురేష్ డిమాండ్**

**సింగరాయకొండ, జూన్ 2, ప్రభాతవార్త**



తెనాలిలో దళితులను బహిరంగంగా శిక్షించిన ఘటనపై బాధ్యత వహిస్తూ సంబంధిత పోలీసులపై చట్టపరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని పిఏసి సభ్యులు, కొండేపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్ డిమాండ్ చేశారు.మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మండల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సమక్షంలో నడిరోడ్డుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి లాఠీలతో శితక బాధడంపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలన్నారు. "కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగిపోయాయి.ఇది ఆందోళనకర పరిణామమని అన్నారు.మానవ హక్కులు పాటించాల్సిన పోలీసులు ఈ విధంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం" అని అన్నారు. జాల్లపాలెం దొంగతనం కేసులో సిసి ఫుటేజ్ పరిశీలించేందుకు సమీపంలో ఉన్న మారంరెడ్డి కొండలరావు దుకాణంలోని సీసీ ఫుటేజ్ ను పరిశీలించేందుకు వెళ్లారు.మాకు ముందస్తు సమాచారం లేకుండా మా దుకాణంలోకి వెళ్లడానికి మేము ఒప్పుకోనేది లేదని అడ్డుకున్నారు. ఆగ్రహించిన మర్రిపూడి ఎస్సై రమేష్ బాబు మారంరెడ్డి కొండలరావు భార్య, చెల్లెలు చంద్రమ్మను పక్కకు నెట్టి లోపలికి ప్రవేశించారు.ఇంట్లోని కంప్యూటర్ కు సంబందించిన వస్తువులును తీసుకొని వెళ్లారు.ఇటువంటి దుర్మార్గ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మసనం వెంకట్రావు, నాయకులు చుక్క కిరణ్, సుల్తాన్ పాల్గొన్నారు.

### డాక్యుమెంట్లు పోయినవి

**తాటిపర్తి లిఖితారెడ్డి తండ్రి యల్లమందా రెడ్డి ఏపిఐఐసి ప్లాట్‌నెం.633-635, గుళ్ళాపల్లి గ్రామం,మద్దిపాడు మండలం అను నాకు చెందిన అద్దంకిమండలం చక్రాయపాలెం గ్రామం సర్వేనెం.39లోని 4.56సెంట్లు ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 2061/2004 పొలం పత్రాలు లిఖిత ఎనర్జీ సిస్టమ్స్ ప్రైవేటు లిమిటెడ్ కార్యాలయంలో పోయినవి. ఇవి దొరికిన వారు మా అడ్రసుకు తెలియజేయగలరు. సెల్ నెం. 9849008414.**

### డాక్యుమెంట్లు పోయినవి

**తాటిపర్తి యల్లమందారెడ్డి తండ్రి రాఘవ రెడ్డి ఏపిఐఐసి ప్లాట్‌నెం.633-635, గుళ్ళాపల్లి గ్రామం, మద్దిపాడు మండలం అను నాకు చెందిన కొప్పోలు గ్రామ సర్వే నెం. 251, 252 లోని 3.79 సెంట్లు. ఒరి జినల్ డాక్యుమెంట్ నెం. 7705/2007.అదే విధంగా అద్దంకి మండలం చక్రాయ పాలెం గ్రామం సర్వేనెం.39లోని 4.57 సెంట్లు ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 2062/2004 పొలం పత్రాలు లిఖిత ఎనర్జీ సిస్టమ్స్ ప్రైవేటు లిమిటెడ్ కార్యాలయంలో పోయినవి. ఇవిదొరికిన వారు మా అడ్రసుకు తెలియజేయగలరు. సెల్ నెం. 9849008414.**

